బొడ్రాయి

'బొడ్రాయి' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

ఢిల్లీ పార్టీలతో తెలంగాణకు ఒరిగేదేంది?

తెలంగాణ రాష్ట్ర పునర్నిర్మాణంలో బాలారిష్టాలను అధిగమించి అన్ని రంగాల్లో దేశంలోనే అత్యంత శక్తివంతమైన రాష్ట్రంగా అవతరించనున్న తరుణంలో నవంబర్ ముప్పైన రాష్ట్ర శాసనసభకు జరగబోయే ఎన్నికలు రాష్ట్రానికి అత్యంత కీలకమైనవి. ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా ప్రజలకు, రాష్ట్రానికి ఇంతవరకు మేలుచేసిందెవరు? భవిష్యత్తులో ఎవరు చేస్తారో? క్షుణ్ణంగా పరిశీలించి వారికి ఈ ఎన్నికల్లో తమ ఓటు వేయవలసిన ఆవశ్యకత తెలంగాణ రాష్ట్ర ప్రజలపై ఉన్నది.

ఢిల్లీకి చెందిన కాంగ్రెస్ , బీజేపీ నాయకులు, ఢిల్లీ దూతలు కర్ణాటక, గుజరాత్ నోట్ల కట్టలతో ప్రజలను మభ్యపెట్టేందుకు ఇప్పటికే తెలంగాణ రాష్ట్రంలోని గల్లీలను చుట్టుముట్టినట్లు అనేక వార్తలు ప్రజలలో బలంగా వినిపిస్తున్నాయి. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఎన్నికలు సమీపిస్తున్నకొద్దీ తెలంగాణ రాష్ట్రంలో కోట్లాది రూపాయలు పట్టుబడుతుండడంతో ఈ వార్తలను ప్రజలు విశ్వసించే పరిస్థితి ఏర్పడింది. అదేవిధంగా ప్రజలను కులాలు, మతాలు, ప్రాంతాల వారీగా విభజించి తాము లబ్ధి పొందాలని భావిస్తున్నట్టు కాంగ్రెస్, బీజేపీలు ప్రజలకు ఇస్తున్న హామీలు, ఆ పార్టీలు గతానికి భిన్నంగా కేటాయిస్తున్న సీట్లు తేటతెల్లం చేస్తున్నాయి. రాష్ట్రంలో యాభైనాలుగు శాతం ఉన్న బీసీల ఓట్లను పొందేందుకు కాంగ్రెస్, బీజేపీలు విశ్వప్రయత్నాలు చేస్తున్నాయి. కానీ బీసీలకు టికెట్ల కేటాయింపుల్లో కాంగ్రెస్ పార్టీ ఘోరంగా విఫలమయ్యింది. టికెట్ల కేటాయింపు విషయంలో బీసీలకు ఇచ్చిన మాటను విస్మరించడం కాంగ్రెస్ పార్టీకి కొత్తేమీ కాదు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీకి పదకొండు పర్యాయాలు అవకాశం వస్తే ఆ సమయంలో ఒక్క పర్యాయం కూడా బీసీ వ్యక్తికి కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి పదవి కేటాయించలేదు. ఏడు పర్యాయాలు ఒక్క రెడ్డి సామాజిక వర్గానికే కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రిగా అవకాశాలు కల్పించింది. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడా బీసీ జనగణన చేసిన దాఖలాలు లేవు. తెలంగాణ రాష్ట్రంలో బీసీలకు అధిక సీట్లు కేటాయించడంతో పాటు బీసీ అభ్యర్థికి ముఖ్యమంత్రి పదవి కేటాయిస్తున్నట్టు బీజేపీ ఇటీవల ప్రకటించింది. కానీ అదే బీజేపీ మొన్నటి వరకు రాష్ట్ర బీజేపీ అధ్యక్షునిగా ఉన్న బీసీ నేత బండి సంజయ్‌ను తొలగించి, ఆస్థానంలో అగ్ర వర్ణానికి చెందిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని నియమించింది. అదేవిధంగా బీసీ జనగణన చేయకుండా, కేంద్రంలో బీసీలకు మంత్రిత్వశాఖ కేటాయించకుండా, బీసీలకు చట్టసభల్లో , మహిళా బిల్లులో రిజర్వేషన్లు కల్పించకుండా బీజేపీ కాలయాపన చేస్తూ ఉన్నది. ఈ పరిణామాల దృష్ట్యా కాంగ్రెస్, బీజేపీలను ఎలా నమ్మాలనేది బీసీలలో మెదలుతున్న మిలియన్ డాలర్ల ప్రశ్న. గత తొమ్మిదిన్నరేండ్లుగా దేశాన్ని పరిపాలిస్తున్న ఎన్డీఏ ప్రభుత్వంలో గ్యాస్, పెట్రోల్, డీజిల్, నిత్యావసర వస్తువుల ధరలు మూడింతలు పెరిగాయి. దీంతో పేద, మధ్య తరగతి ప్రజల జీవన ప్రమాణాలు మరింత దిగజారాయి. అధిక ధరలు అరికట్టవలసిన కేంద్రం ధరల పెరుగుదల నెపాన్ని రాష్ట్ర ప్రభుత్వాలపై నెట్టివేసి చేతులు దులుపుకోవడం దురదృష్టకరం.

తెలంగాణలో లక్షలాది మంది ఏపీ వాసులు అనేక దశాబ్దాల నుంచి స్థిరపడి ఉన్నారు. వీరంతా కేసీఆర్ నాయకత్వంలోని నూతన రాష్ట్రంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతమైన జీవనం సాగిస్తున్నారు. వీరి ఓట్లు పొందేందుకు కూడా కాంగ్రెస్, బీజేపీలు రకరకాల ప్రయత్నాలు చేస్తున్నాయి. రాజకీయ పార్టీలు ప్రతి ఒక్కరి ఓట్లు ఆశించవచ్చు. దానిలో తప్పు పట్టాల్సిన అంశం ఏమీ లేదు. కానీ తాము కూడా తెలంగాణ రాష్ట్ర ప్రజలమే అని భావించి తెలంగాణ రాష్ట్ర ప్రజలతో ఏపీ ప్రజలు అన్ని విధాలుగా కలిసిపోయి ప్రశాంతంగా తమ పని తాము చేసుకుంటూ పోతున్నారు.

> తెలంగాణలో ప్రశాంత జీవనం సాగిస్తున్న ఏపీ ప్రజలను ఓట్ల కోసం తెలంగాణ రాష్ట్ర ప్రజల నుంచి వేరు చేస్తూ ప్రజల మధ్య ప్రాంతీయ తత్వాన్ని రెచ్చగొట్టే చర్యలకు జాతీయ పార్టీలు పూనుకుంటున్నాయి. ఈ పరిణామాన్ని ప్రతి ఒక్కరూ ఖండించాల్సిందే.

ఉమ్మడి రాష్ట్రాన్ని కాంగ్రెస్ అయిదు దశాబ్దాలకు పైగా పరిపాలించింది. ఆ సమయంలో ముఖ్యమంత్రులుగా ఉన్నవారు తమ పదవులు కాపాడుకునేందుకు ఢిల్లీ చుట్టూ తిరుగుతూ తమ సమయమంతా వెచ్చించారు. వారిని దించడానికి మరో వర్గం ప్రయత్నిస్తూ ఉండేది. దీంతో అస్థిరమైన ప్రభుత్వాలు నడిచేవి. ఒక్కో పర్యాయం ఇద్దరు, ముగ్గురు ముఖ్యమంత్రులు మారేవారు. దాంతో వారికి ప్రజలకు మంచి చేయాలనే స్పృహ, సమయం రెండూ ఉండేవి కావు. రెండు రాష్ట్రాల్లో పేదలకు ప్రస్తుత ప్రభుత్వాలు ఇస్తున్న ఇండ్లు, ఇండ్ల స్థలాల కోసం లక్షలాది మంది క్యూ కట్టడం పరిశీలిస్తే గతంలో కాంగ్రెస్ ప్రజలకు ఎంత మేలు చేసిందో సులభంగా అర్థమవుతుంది. ఈ పరిణామాల దృష్ట్యా భవిష్యత్తులో కూడా కాంగ్రెస్ పార్టీ స్థిరమైన ప్రభుత్వాన్ని ఎంతవరకు ఏర్పరచగలదనేది నేడు తెలంగాణ రాష్ట్ర ప్రజలముందున్న వెయ్యి డాలర్ల ప్రశ్న.

భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 76 ఏండ్లు గడవగా ఆ సమయమంతా దేశాన్ని కాంగ్రెస్, బీజేపీలు పరిపాలించాయి. ప్రస్తుతం కూడా దేశాన్ని బీజేపీ పరిపాలిస్తున్నది. అయినా ప్రపంచంలో ఉన్న పేద దేశాల్లో భారతదేశం కూడా ఒకటిగా ఉన్నది. పేపర్లు, గణాంకాలు, రాజకీయ నేతల మాటల్లో మాత్రం దేశంలో పేదరికం గణనీయంగా తగ్గింది. నిజంగా పేదరికం తగ్గినట్లైతే దేశంలో కోట్లాదిమంది ప్రజలు ఇంకా ఎందుకు ప్రభుత్వాలు ఇచ్చే రేషన్ బియ్యం కోసం క్యూ కడుతున్నారు? గూడు లేక ఇంకా కోట్లాది మంది కిరాయి ఇండ్లల్లో ఎందుకు నివసిస్తున్నారు? ఇంకా ఎందుకు కోట్లాదిమంది కట్టెల పొయ్యిలపై వంట చేసుకుంటున్నారు? ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లేక చదువుకున్న యువత నిరుద్యోగంతో ఇంకా ఎందుకు బాధపడుతున్నట్టు ? దేశవ్యాప్తంగా కోట్లాది మంది రైతులు ఎందుకు ఆత్మహత్యలు చేసుకుంటున్నట్టు ? కరోనా సమయంలో దేశవ్యాప్తంగా కోట్లాది మంది ఉపాధి కూలీలు తమ స్వరాష్ట్రాలకు పోవడానికి అష్టకష్టాలు పడిన వైనం ప్రపంచమంతా చూసింది. దీని ప్రకారం దేశంలో ఇంకా కోట్లాది మంది ఉపాధి కోసం సుదూర ప్రాంతాలకు వలస వెళ్తున్నారని కచ్చితంగా చెప్పవచ్చు. ఇన్నేండ్ల స్వాతంత్ర్యంలో ఉపాధి కోసం ఇంకా వలసలెందుకు జరుగుతున్నాయి ? దేశ సంపదలో 90 శాతం సంపద కేవలం కొద్ది మంది వ్యక్తుల వద్దే ఎందుకున్నట్టు ? అనేవి జవాబులేని ప్రశ్నలు. దీంతో జాతీయ స్థాయిలో పేదరిక నిర్మూలన, నిరుద్యోగ నిర్మూలనపై కేంద్రం వద్ద ప్రణాళికలు ఉన్నాయా ? లేవా ? అనే అనుమానాలు ప్రజల్లో బలంగా వెలువడుతున్నాయి. ప్రజలకు ఉచిత విద్య, వైద్యం అందించవలసిన బాధ్యత కచ్చితంగా కేంద్ర ప్రభుత్వంపై ఉన్నది. కానీ దీన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు వదలి వేయడం కేంద్రం బాధ్యతారాహిత్యాన్ని తేటతెల్లం చేస్తున్నది. ఇవన్నీ ప్రజలకున్న ప్రాథమిక హక్కులు. వీటి కోసం ఇంకా పోరాడాల్సిందేనా?

స్వతంత్ర భారతావనిలో నాటి నుంచి నేటి వరకు దేశాన్ని పరిపాలించిన, ప్రస్తుతం పరిపాలిస్తున్న ఏ కేంద్ర ప్రభుత్వం ఇటువంటి విషయాలపై కనీసం సమీక్ష కూడా జరిపిన దాఖలాలు ఇప్పటివరకు లేవు. ఒక్క మెతుకు చూసి అన్నం ఉడికిందో ? లేదో? తెలుసుకోవచ్చు. అదేవిధంగా ప్రజలకు మేలు చేసే అంశంలో ఈ అంశాల ప్రాతిపదికన కాంగ్రెస్, బీజేపీలకు ఉన్న చిత్తశుద్ధి ఏపాటిదో గహించవచ్చు. ఆ రెండు పార్టీలు అధికారంలోకి వస్తే ఏ కార్యక్రమం జరగాలన్నా ఆ పార్టీల ఆధిష్ఠానం అనుమతి కచ్చితంగా తీసుకోవాలి. దానికోసం వారి ఆధిష్ఠానం చెప్పినట్టు వినేవారిని ముఖ్యమంత్రి స్థానంలో కూర్చోబెట్టి రిమోట్‌ను ఢిల్లీలోని తమ చేతిలో పెట్టుకుంటాయి. ఈ విధమైన రిమోట్ పాలనతో తెలంగాణ రాష్ట్ర ప్రజలకు మేలు జరుగుతుందనుకోవడం ఖచ్చితంగా భ్రమే.

కైలసాని శివప్రసాద్
94402 03999

> జాతీయ స్థాయిలో పేదరిక నిర్మూలన, నిరుద్యోగ నిర్మూలనపై కేంద్రం వద్ద ప్రణాళికలు ఉన్నాయా ? లేవా ? అనే అనుమానాలు ప్రజల్లో బలంగా వెలువడుతున్నాయి. ప్రజలకు ఉచిత విద్య, వైద్యం అందించవలసిన బాధ్యత కచ్చితంగా కేంద్రప్రభుత్వంపై ఉన్నది. కానీ దీన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు వదలి వేయడం కేంద్రం బాధ్యతారాహిత్యాన్ని తేటతెల్లం చేస్తున్నది. ఇవన్నీ ప్రజలకున్న ప్రాథమిక హక్కులు.

ఎగిరేది ఉద్యమ జెండానే

ఉద్యమాల గడ్డ తెలంగాణ ఏడు దశాబ్దాల క్రితం వేసిన ఆత్మగౌరవ పొలికేక 2014లో వాస్తవరూపం దాల్చింది. నాలుగు కోట్ల ప్రజల సుదీర్ఘ స్వప్నం సాకారమైంది. ఉద్యమంలో వేలు, లక్షలుగా ప్రజలు పాల్గొన్నా ఆ ఉద్యమానికి దిశానిర్దేశం చేసిన చుక్కాని ఒక్కరే. ఆయనే ప్రజా నాయకుడు. ఉద్యమ నేత కేసీఆర్. ఆయన అడుగుపెడితే చాలు హుస్నాబాద్... సిద్దిపేట ..సిరిసిల్ల... వనపర్తి... అచ్చంపేట... మునుగోడు జిల్లాలు, నియోజక వర్గాలేవైనా నేల ఈనిందా అన్నట్టు లక్షలాది మంది గుమికూడాల్సిందే.

సీఎం కేసీఆర్ ఒక సమావేశంలో పాల్గొంటున్నారంటే చాలు అక్కడ హాజరైన ప్రజలు ఆయన చెప్పే మాటలు బడిపిల్లల్లా శ్రద్ధగా వింటారు. రెండు పర్యాయాలు ముఖ్యమంత్రిగా అధికారంలో ఉన్నా ఇసుమంతయినా చరిష్మా తగ్గని మేరు నగధీరుడు కేసీఆర్. 2009 నవంబర్ 29న తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష పూనిన రోజు. ఆరోజు తెలంగాణ సమాజమంతా కేసీఆర్ దీక్షకు మద్దతుగా రోడ్లపైకి వచ్చి వివిధ రూపాల్లో ఆయనకు మద్దతు తెలియజేయడమే కాకుండా తెలంగాణ రాష్ట్రం ఏర్పడే వరకు కేసీఆర్ వెంటే ఉంటామని శపథాలు చేసి ఉద్యమంలో పాల్గొన్నది.

> తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైన తర్వాత 2014లో జరిగిన ఎన్నికల్లో కేసీఆర్ ద్వారానే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని టీఆర్ఎస్ అధ్యక్ష స్థానంలోఉన్న కేసీఆర్ ను దీవించి గెలిపించి ముఖ్యమంత్రిని చేశారు తెలంగాణ ప్రజలు. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి సంక్షేమంలో దేశంలోనే అన్ని రాష్ట్రాల కంటే ముందు వరుసలో నిలిపారు. అది మాసిన తెలంగాణ సమాజం 2018లో కేసీఆర్‌కు మరోసారి పెద్ద ఎత్తున మద్దతు తెలియజేసి రెండవ సారి ముఖ్యమంత్రిని చేశారు.

ఈసారి మరింత బాధ్యతతో రాజకీయాలను పూర్తిగా పక్కనబెట్టి కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాలలో భారతదేశంలోనే నెంబర్ వన్ స్థితిలోకి తెచ్చారు. ఇది ఎంతమాత్రం అతిశయోక్తి కాదు గణాంకాలు ఇస్తున్న వివరణ ఇది. ఒకనాడు ఆత్మహత్యలతో కునారిల్లిన తెలంగాణ గడ్డ, నాడు బాధలు పడ్డ తెలంగాణ, గాయపడ్డ తెలంగాణ, అన్యాయానికి, పీడనకు, దోపిడీకి, హేళనకు గురైన తెలంగాణను నేడు ఆత్మగౌరవంతో తలెత్తుకొని బతికే విధంగా అన్ని వర్గాల ప్రజలు సుఖ సంతోషాలతో ముందుకు పోయే విధంగా సుపరిపాలన సాగిస్తున్నారు కేసీఆర్.

2023లో ముచ్చటగా మూడోసారి ముఖ్యమంత్రి చేయడానికి తెలంగాణ సమాజం అదే ఉత్సాహంతో, అంతే ప్రేమ, ఆప్యాయతలతో గౌరవ మర్యాదలతో ఆశీర్వదిస్తున్నది. ఎన్నికల సభల్లో భాగంగా హుస్నాబాద్‌లో జరిగిన మొదటి బహిరంగ సభకు వచ్చిన ప్రజల్లో, టీఆర్ఎస్ పార్టీ పైన, కేసీఆర్ పైన అంతే వాత్సల్యం కనిపించింది. అదే ప్రేమ ఆప్యాయతలను రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న సభల్లోనూ చూపిస్తున్నారు. దీంతో మూడోసారి బీఆర్ఎస్ గెలుపు, కేసీఆర్ హ్యాట్రిక్ విజయంతో ముఖ్యమంత్రి కావడం ఖాయమని తేలిపోయింది. అది తెలంగాణ మట్టి మనుషులకు, ఉద్యమ పితామహునికి మాత్రమే అర్థమయ్యే బాష. కానీ సోషల్ మీడియాలో, ఆంధ్రా మీడియాలోనూ తప్పుడు ప్రచారాలు తప్పుడు సర్వేలతో నేటికీ సీమాంధ్ర చేతిలో ఉన్న మీడియా చర్విత చర్వణంగా అవే గాలి వార్తలతో కేసీఆర్‌ను బలహీన పరచాలని చూస్తున్నది.

ఆ మీడియా ఇతర పార్టీల వాపును బలుపుగా ప్రచారం చేయడం, బీఆర్ఎస్‌ను ప్రజల్లో తక్కువ చేయాలని చూస్తున్న కుట్రలను ఎప్పటికీ తెలంగాణ సమాజం తిప్పి కొడుతూనే ఉండాలి. నేను 2018లో పార్టీ ఎలక్షన్ సెల్ మెంబర్‌గా పని చేశాను. ఎన్నికల ముందు రెండు నెలలు సీమాంధ్ర మీడియా, తెలంగాణ వ్యతిరేక శక్తులు తప్పుడు రిపోర్టులతో సోషల్ మీడియా ద్వారా ప్రజలను గాలి గాలి చేయటం చూశాను.

పార్టీ ప్రతినిధిగా ఎన్నో టీవీ చర్చలకు వెళ్లాను. ఆయా సందర్భాల్లో చర్చకు పిలిచిన ఆంధ్ర ఛానళ్లు, 'ప్రత్యేక సర్వేలు చేయించాం. ఆ సర్వేల్లో ప్రజలు టీఆర్ఎస్, కేసీఆర్‌లకు వ్యతిరేకంగా ఉన్నార'ని తప్పుడు రిపోర్టులు చూపించేవారు. మీరు అధికారం కోల్పోతున్నారని మనల్ని బలహీనపరచాలని చూసేవారు. కానీ మన నాయకుడిచ్చిన నమ్మకంతో అనేక టీవీ డిబేట్స్‌లో ఢీ అంటే ఢీ అని చర్చల్లో పాల్గొనే వాళ్లం. రిజల్ట్ వచ్చిన తర్వాత 63 నుంచి 88 సీట్లకు పెరిగాం.

ఇప్పుడు కూడా వీళ్లు చేసే ప్రచారాలు అలాంటివే వీటిని ఏమాత్రం కూడా లెక్క చెయాల్సిన అవసరం లేదు. ఈ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చే తీర్పు మన నాయకుడిని జాతీయనాయకుడిగా, బీఆర్ఎస్‌ను జాతీయ పార్టీ స్థాయికి తీసుకెళుతుందని మా ప్రగాఢ విశ్వాసం. తెలంగాణ సమాజానికి వాస్తవాలేమిటో తెలుసు. రాబోయే కాలంలో భారతదేశ రాజకీయ యవనికలో బీఆర్ఎస్ సాధించే విజయం ఒక మైలురాయిగా మిగిలిపోతుంది. సీఎం కేసీఆర్ పాల్గొంటున్న ప్రతీ సమావేశం పార్టీ శ్రేణులను ఉత్తేజితులుగా మార్చేస్తున్నాయి. 2018 నాటి విజయాన్ని మించిన విజయం 2023 ఎన్నికల్లో బీఆర్ఎస్ స్వంతమవుతుంది. మూడోసారి కూడా తెలంగాణ ముఖ్యమంత్రిగా కేసీఆర్ గద్దెనెక్కడం ఖాయం. ఈవిధంగా దక్షిణ భారతంలో కేసీఆర్ చరిత్ర సృష్టించనున్నారు.

(వ్యాసకర్త : రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యులు)
సీ హెచ్ ఉపేంద్ర
99632 02547

సంక్షేమ పథకాలు విజయ సోపానాలు

> ప్రత్యేక రాష్ట్రంలో ప్రతి ఇంటికి తెలంగాణ ప్రభుత్వ పథకం అందింది. రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో ఉన్న అన్ని కుటుంబాలకు ఏదో ఒక పథకం లేదా ఒక్కో కుటుంబానికి రెండు అంతకుమించి పథకాలు అందాయి. అంతేకాదు అభివృద్ధి ఫలాలు పథకాలతో పాటు తెలంగాణ వ్యాప్తంగా సబ్బండ వర్గాలకు చేరాయి. ఇవే కేసీఆర్‌ను రాబోయే ఎన్నికల్లో సునాయాసంగా గెలిచేలా చేస్తున్నాయి.

కేసీఆర్ గెలుపు ఖాయమంటూ అనేక సర్వేలు చెబుతున్న మాట వాస్తవం. సర్వేలు చేస్తున్న సంస్థలు, చెప్పున్న విషయాలు అంత ఆషామాషీగా తీసుకోరాదు. సర్వేల వెనుక క్షేత్రస్థాయిలో జరిపిన అధ్యయనం, అన్ని వర్గాల ఓటర్ల అభిప్రాయాలు ఉంటాయి. సర్వే ఏదైనా గెలిచేది కారేనని ముక్తకంఠంతో చెప్పున్నాయి.

***

వాస్తవానికి సర్వేలే కాదు. సామాన్యులు కేసీఆర్ హ్యాట్రిక్ సాధిస్తారనే చెప్పున్నారు. స్వతంత్ర భారతదేశంలో తొమ్మిదేండ్లుగా తెలంగాణ ప్రజలు కనీవినీ ఎరుగని పథకాలు, ప్రగతిని చూస్తున్నారు. దేశం నివ్వెరపోయేలా చేస్తున్న కార్యక్రమాలే కేసీఆర్‌ను మరోసారి ముఖ్యమంత్రి పీఠంపై కూర్చోబెడుతాయని అంటున్నారు. దీనికి ప్రాతిపదికలు ప్రగతి రూపంలో చాలా ఉన్నాయి.

రాష్ట్ర ప్రజల సంక్షేమానికి కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చినంత ప్రాధాన్యం గత ఏ ఇతర ప్రభుత్వాలు ఇవ్వలేదంటే అతిశయోక్తి కాదు. అందుకు ప్రత్యక్ష ఉదాహరణే పింఛన్లు. రాష్ట్రంలో దాదాపు అన్ని వర్గాలు కలిపి 44,12,882 మంది పింఛన్లు పొందుతున్నారంటే తెలంగాణలో సంక్షేమం ఏ మాదిరిగా ఉందో మనం అంచనా వేయవచ్చు.

పింఛన్లు ఒక్కటే కాదు. రాసుకుంటూ పోతే చాలా పథకాలు ఉన్నాయి. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ వంటి పథకాల ద్వారా ఆడబిడ్డల పెండ్లికి ప్రభుత్వం ద్వారా రూ.1,00,116లు అందుతున్నాయి. దివ్యాంగులకు కల్యాణలక్ష్మి పథకం కింద రూ. 1,25,145 చెల్లిస్తున్నారు. ఇప్పటివరకు 13,32,964 మంది నిరుపేద ఆడబిడ్డలకు కేసీఆర్ ప్రభుత్వం కల్యాణలక్ష్మి కింద దాదాపు రూ.12 వేల కోట్ల రూపాయలను ఖర్చు చేసింది. ఇక ప్రపంచమే ఆశ్చర్యపోయేలా రాష్ట్ర ప్రభుత్వం దళితుల అభివృద్ధి కోసం దళితబంధు పథకాన్ని ప్రవేశపెట్టింది. దీనికిందట రూ.10 లక్షల గ్రాంటును అందజేసింది. ఈ పథకం ద్వారా రాష్ట్రంలో 38,323 మంది దళితులను గుర్తించి రూ.3832.30 కోట్లను అందజేసింది. షెడ్యూల్డ్‌కులాల ప్రత్యేక ప్రగతి నిధి కింద రూ.92,640.41 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేసింది.

అదేవిధంగా సామాజిక సమానత్వం సాధించడంలో భాగంగా కులాంతర వివాహం చేసుకున్న జంటలకు రూ.2.5 లక్షల ప్రోత్సాహకాన్ని అందిస్తున్నది. ఇప్పటివరకు 6,315 మంది జంటల కులాంతర వివాహాలకు ప్రోత్సాహాన్ని అందించింది. ఎస్సీ హాస్టళ్ల నిర్వహణ కోసం రూ.1976.91 కోట్లు ఖర్చు చేసింది. అంబేద్కర్ ఓవర్సీస్ కింద విదేశాల్లో విద్య కోసం రూ.20 లక్షల స్కాలర్ షిప్‌ను అందిస్తున్నది ప్రభుత్వం. ఇప్పటివరకు 1031 మందికి రూ.179.92 కోట్లను అందజేసింది. దళితులకు మూడెకరాలు కింద గడిచిన పదేండ్లలో 17,097.09 ఎకరాలను ప్రభుత్వం 6,998 మందికి అందజేసింది. దీనికోసం కేసీఆర్ ప్రభుత్వం ఏర్పడ్డాక రూ.769.17 కోట్లను ఖర్చుచేసింది. దళితులను పారిశ్రామికవేత్తలుగా ప్రోత్సహించేందుకు 1,60,914 మందికి 2013.64 కోట్ల రూపాయలను సబ్సిడీ ద్వారా అందజేసింది. ప్రతి దళిత, గిరిజన కుటుంబానికి ఇంటికి 101 యూనిట్ల విద్యుత్తును ఉచితంగా అందజేసింది.

ఎస్సీ, ఎస్టీ , బీసీ, మైనారిటీ, అగ్రవర్ణ పేదలకు గురుకుల పాఠశాలలు, కాలేజీలు ఏర్పాటు చేసింది. స్టడీ సర్కిళ్లను ఏర్పాటు చేసింది.ఎస్టీ సబ్ ప్లాన్ కింద రాష్ట్ర ప్రభుత్వం రూ.43,936.32 కోట్లను ఖర్చు చేసింది. గ్రామ పంచాయతీలుగా గిరిజన తండాలను మార్చిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిది. పోడు పట్టాలు అందజేయడంతోపాటు గిరిజనులపై ఉన్న కేసులను ఎత్తివేసింది.

> బీసీ సంక్షేమంలో భాగంగా లక్ష రూపాయలను అందజేస్తున్నది. 119 నియోజకవర్గాల్లో కలిపి 5950 మందికి లక్ష చొప్పున ఆర్థిక సాయం అందించింది. అన్ని కులాలకు ఆత్మగౌరవ భవనాలను మంజూరు చేసి వాటి కోసం విలువైన స్థలాలను కేటాయించింది. బీసీ స్టడీ సర్కిళ్లను ఏర్పాటు చేసింది. నేతన్నకు సాయం వంటి కార్యక్రమాలను చేపట్టింది. బీసీల కోసం ఇంకా అనేక పథకాలున్నాయి.

షాదీముబారక్ పథకం కింద వివాహ సమయంలో రూ. 1,00,116 లను ప్రభుత్వం ఆర్థిక సహాయంగా అందిస్తుంది. గడిచిన పదేండ్లలో 2,68,230 మంది పెళ్లిండ్లకు రూ. 2,258.17 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేసింది. విదేశీ విద్య కోసం మైనారిటీ శాఖ ఆధ్వర్యంలో ఇప్పటివరకు 2751 మంది పిల్లలకు ఒకొక్కరికీ రూ.20 లక్షల చొప్పున రూ.438.66 కోట్లు అందజేసింది. ఇమాం మౌజంలకు గౌరవ వేతనం అందించింది. బీసీల మాదిరిగానే వీరికి లక్ష రూపాయల సాయం అందిస్తున్నది. ఇక రైతాంగం విషయానికి వస్తే రైతులకు మద్దతు ధర చెల్లించి పండిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తున్నది. గతంలో దళారులు చొరబడి తక్కువ ధరకు కొనుగోలు చేసి రైతులను నష్టపరిచేవారు. అదేవిధంగా రైతుబంధు పథకం విప్లవాత్మకమైనది. దీనికి ఐక్యరాజ్యసమితి ప్రశంసలు అందాయి. ఆగస్టు 2023నాటికి 10 విడతల్లో 68,99,076 మంది రైతులకు రైతుబంధు కింద రూ.74,815 .09 కోట్లను పంట పెట్టుబడి సాయంగా అందజేసింది. రూ.37 వేల కోట్లు రుణమాఫీ చేసింది ప్రభుత్వం.

కేసీఆర్ కిట్, గర్భిణులకు కేసీఆర్ పోషకాహార కిట్ వంటి వినూత్న పథకాలను ప్రవేశపెట్టి కేసీఆర్ ప్రభుత్వం ప్రశంసలు అందుకుంటున్నది.వైద్యరంగంలో అనేక సంస్కరణలు చేపట్టింది. జిల్లాకో మెడికల్ కళాశాల, బస్తీ దవాఖానాలు, డయాలిసిస్ సెంటర్లు, డయోగ్నస్టిక్ సెంటర్లతో వైద్య రంగాన్ని ప్రజల చెంతకు తెచ్చిన ఏకైక ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వం.

అంతేకాకుండా మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికి నల్లా ద్వారా త్రాగునీరు అందించడం, మిషన్ కాకతీయ ద్వారా చెరువుల పునరుద్ధరణ, చెక్ డ్యాంల నిర్మాణం, కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి వంటి ప్రపంచస్థాయి సాగు నీటి ప్రాజెక్టుల వంటి అభివృద్ధి తెలంగాణకు సొంతం. ఇలా అన్ని వర్గాల సంక్షేమం కోసం పథకాలు రూపకల్పన చేయబడ్డాయి. ఒక రకంగా చెప్పాలంటే 'హనుమంతుడి గుడిలేని ఊరు లేదు. కేసీఆర్ పథకం అందని ఇల్లు లేదు.' లబ్ధిపొందిన ప్రతి వ్యక్తి తన ఓటును కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్‌కు వేస్తారు. కారు గెలుపు సారు గెలుపు ఖాయమైందని ప్రజలు చర్చించుకుంటున్నారు.

(వ్యాసకర్త : బీఆర్ఎస్ సీనియర్ నాయకులు)
పీ.ఎల్.శ్రీనివాస్
73374 01177

ప్రజా బాంధవుడే పాలకుడవ్వాలి

> తెలంగాణ ఉద్యమాన్ని ప్రారంభించి, ఆ ఉద్యమాన్ని గమ్యస్థానానికి చేర్చి, ప్రజల ఆకాంక్షను నెరవేర్చిన మహానాయకుడు మన కేసీఆర్. తెలంగాణ స్వరాష్ట్రం కోసం పదవులను గడ్డి పోచలుగా త్యాగం చేసి టీఆర్ఎస్ పార్టీని స్థాపించి తన ప్రాణాల్ని సైతం పణంగా పెట్టిన ఉద్యమ ధీశాలి కేసీఆర్. ఉద్యమ స్ఫూర్తితోనే బంగారు తెలంగాణకు బాటలు వేస్తూ అభివృద్ధి, సంక్షేమ ఫలాలను సబ్బండ వర్గాలకు అందిస్తున్న దేశం గర్వించదగ్గ పరిపాలనదక్షుడు మన కేసీఆర్. తెలంగాణ ప్రజల ఆశీస్సులతో, ఇంటిపార్టీగా ముచ్చటగా మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీ మునిగి పోయే పడవ. ముఖ్యమంత్రి కేసీఆర్ పై నానాటికి పెరుగుతున్న విశ్వసనీయతకు బీఆర్ఎస్ పార్టీలోకి వస్తున్న వలసల ప్రవాహమే నిదర్శనం. రాష్ట్ర అభివృద్ధి బీఆర్ఎస్ తోనే సాధ్యం అవుతుందన్న నమ్మకం ప్రజల్లో బలపడింది. దాంతో గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ఇతర పార్టీల నాయకులు బీఆర్ఎస్ లో చేరుతున్నారు.

వ్యవసాయ రంగంలో అద్భుతాలను సృష్టించాలనే ఉద్దేశంతో కేసీఆర్ అనేక ప్రజా సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారు. రైతుల్లో నవచైతన్యానికి సీఎం కేసీఆర్ నాంది పలికారు. రైతుబంధు పథకం ద్వారా ప్రభుత్వం ఎకరాకు రూ.10వేలు పంట సాయం అందిస్తున్నది. ఇప్పుడు 16 వేలకు పెంచారు. అన్నదాత మృతి చెందితే వారం రోజుల్లోనే రైతుబీమా పథకం ద్వారా చనిపోయిన రైతు క